

ఎండ ప్రచండం

- నిప్పుల కొలిమిలా ఉమ్మడి జిల్లా
- నాలుగు రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- పొడ్చన్‌పల్లిలో రికార్డ్‌స్థాయిలో 44.3 డిగ్రీలు
- 119 గ్రామాల్లో 40 డిగ్రీలకుపైగా నమోదు





కూల్ అవుదాం..

ఎండలు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ఫ్యాన్ వేస్తే వేడి గాలి... ఏసీ కొందామంటే ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.. ఇక మధ్యతరగతి వారు ఎండ, వేడి, ఉక్కపోత ఉపశమనం పొందేందుకు కూలర్ల వైపు మొగ్గుచూపుతున్నారు. మార్కెట్‌లో రకరకాల కంపెనీల కూలర్లు అందుబాటులో ఉన్నాయి. వాటిని కొనుగోలు చేసి బైక్‌లపైన, ఆటోలపైన తరలిస్తున్నారు.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఏప్రిల్ 24





సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ ప్రాంతంలో తగ్గిన జనసంచారం

మెతుకుసీమ అగ్నిగుండంలా మారుతోంది. నాలుగు రోజులుగా సూర్యుడు నిప్పులు చిమ్ముతున్నాడు. 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతుండడం ఆందోళనను కలిగిస్తోంది. సోమవారం 42.2 డిగ్రీలు, మంగళవారం 42.8 డిగ్రీలు, బుధవారం 43.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, గురువారం ఏకంగా 44 డిగ్రీలకు చేరుకున్నది. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం పొడ్చన్‌పల్లిలో రికార్డు స్థాయిలో 44.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 119 గ్రామాల్లో 40 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మూడేళ్ల తర్వాత ఏప్రిల్‌లోనే ఈస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. 7



రాహుల్ విదేశాలకు వెళ్లినప్పుడే

దేశంలో అలజడులు

- ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే బాధాకరంగా ఉన్నాయని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో రఘునందన్‌రావు మాట్లాడుతూ ఒక వర్గానికి చెందిన కొంతమంది శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. హిందూ ధర్మం పరమత సహనంను పాటించమని చెబుతుందని, హిందూ ఆలయాల మీద దాడులు చేస్తే ప్రస్తుత తరుణంలో ప్రజలు ఊరుకునే పరిస్థితిలో లేరన్నారు. జమ్మూలోని ఉగ్రవాదుల చర్య దుర్మార్గమైందన్నారు. 27 మందిని దుర్మార్గంగా చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లినప్పుడే దేశంలో అలజడులు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. పరదేశానికి చెందిన మతస్థులు మన దేశాన్ని కాపాడలేరన్నారు. స్టాలిన్, కమలాసన్, ప్రకాశ్ రాజ్ ఎందుకు జమ్మూకశ్మీర్ ఘటనపై నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. తెలంగాణను ఎందుకు ఇస్లామిక్ అడ్డాగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ వస్తేనే రాష్ట్రంలో అల్లకల్లోలం అవుతుందన్నారు. రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని మదర్సలపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టెర్రరిస్ట్ సంస్థలపై మోదీ ప్రభుత్వం కచ్చితంగా చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాబర్ట్ వాద్రా బీజేపీపై బురద చల్లటం మానుకోవాలని, ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఒవైసీ నిర్ణయాల వల్ల హైదరాబాద్‌లో అభివృద్ధి జరగలేదని, ఒవైసీ పేద ముస్లింల కోసం ఆలోచించడం లేదని, డెవలప్‌మెంట్‌కు ముస్లింలను దూరంగా ఉంచేది ఎంఐఎం పార్టీనే అని విమర్శించారు.

మా సంగతేంటి..!

- సిద్దిపేట, దుబ్బాక కాంగ్రెస్ నేతలకు పదవులు దూరమేనా
- నామినేటెడ్ పోస్టుల కోసం తప్పని నిరీక్షణ
- ఏడాదిన్నర కావొస్తున్నా ఎదురుచూపులే
- ముఖ్యనేతల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు
- సీఎం, మంత్రులు, పార్టీ ఇన్‌చార్జి పట్టించుకోవాలని విన్నపాలు
- గజ్వేల్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో మాత్రం నియామకాలు పూర్తి



నామినేటెడ్ పోస్టుల పంపకాలపై భిన్నాభిప్రాయాలు నెలకొన్నాయి. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల్లోని కాంగ్రెస్ నేతలకు పదవులు దక్కాయి. ఇదే జిల్లాలో ఉన్న దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాల నేతలు పదవుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలోనే హుస్నాబాద్ నియోజకవర్గంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ఆలయాల పాలకవర్గాలను నియమించారు. తాజాగా గజ్వేల్ నియోజకవర్గంలోనూ పదవుల పంపకం పూర్తయ్యింది. ఇక మా సంగతేంటని సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాల కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో సీఎం, జిల్లా మంత్రి, ఇన్‌చార్జి మంత్రి, పార్టీ ముఖ్యనేతలు చొరవ చూపించాలని విన్నవిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఏప్రిల్ 24:బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటగా చెప్పుకునే సిద్దిపేట జిల్లాలో కరడుగట్టిన కాంగ్రెస్ నాయకులు లేకపోలేరు. రెండు దశాబ్దాలుగా తమ పార్టీ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. స్థానికంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలవకున్నప్పటికీ నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యం దక్కుతుందని భావించారు. అయితే, అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావొస్తున్నా పదవులు రావడం లేదని నైరాశ్యంలో మునిగారు. సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాల నేతలు పదవుల కోసం చేయనంటూ ప్రయత్నాలే లేవు.

గ్రూపులే కారణమా..

1985 నుంచి సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే గెలిచింది లేదు. కానీ ఆ పార్టీలో అనేక గ్రూపులున్నాయి. 2023 ఎన్నికల సమయంలో 16 మంది నేతలు కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేశారంటేనే అర్థమవుతోంది. ఇక్కడ సీఎం, మంత్రులు, ముఖ్యనేతల పేరిట గ్రూపులు కడుతున్నారు. ఫలితంగా పార్టీలో సమన్వయ లోపం తలెత్తుతుందనే అభిప్రాయాలు నెలకొన్నాయి. దీనికితోడు కొత్తగా కాంగ్రెస్‌లో చేరినవాళ్లు తమ ప్రభావాన్ని చూపించుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై సీనియర్లు భగ్గుమంటున్నారు. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు అడ్రస్ లేనివాళ్లంతా అధికారంలోకి వచ్చిన తర్వాత కనిపిస్తున్నారని బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. పాత, కొత్త గ్రూపులు, సీనియర్, జూనియర్ల గ్రూపులు, ప్రభుత్వ పెద్దలు, ముఖ్యనేతల పేర్లు చెప్పుకునే గ్రూపులతో ఉనికిని చాటుకుంటున్నారు. ఈ గ్రూపులతోనే పలుమార్లు పదవులకు సంబంధించిన జాబితాలు తారుమారైనట్లుగా తెలుస్తోంది. ఇవన్నీ గాడిన పడితేనే పదవుల పంపకాలు జరుగుతాయనే భావన వ్యక్తమవుతుంది. దుబ్బాకలో నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. తనవర్గానికి మాత్రమే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఇతర వర్గాల వారు ఫిర్యాదు చేయడం వల్లే ఇక్కడ కూడా పదవుల పంపకం ఆలస్యమవుతున్నట్లుగా తెలిసింది.

పెండింగ్‌లోనే జాబితాలు..

సిద్దిపేట, చిన్నకోడూరు, నంగునూరు, దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట, దౌల్తాబాద్ వ్యవసాయ మార్కెట్లకు ఇప్పటిదాకా కమిటీలను నియమించలేదు. చైర్మన్, డైరెక్టర్ పదవుల కోసం ఆశావహులు నిరీక్షిస్తున్నారు. పలువురి పేర్లతో ఈ కమిటీలకు ఇప్పటికే నియోజకవర్గ ఇన్‌చార్జులు, ముఖ్యనేతలు, మంత్రుల నుంచి జాబితాలు పంపగా పలు దఫాలుగా చేర్పులు, మార్పులు చేశారు. ఒక్కో కమిటీకి రెండు మూడేసి చొప్పున జాబితాలు పంపించడంతో ఏ జాబితాను ఫైనల్

మిగతా 8లో..

లబ్ధిదారుల ఎంపికను

ప్రారంభించాలి

- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించాలని కలెక్టర్ మనుచౌదరి సంబంధిత అధికారులను, బ్యాంకులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, బ్యాంకర్లతో రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై సమావేశం నిర్వహించి పలు ఆదేశాలు జారీచేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వయం ఉపాధి కల్పన లక్ష్యంగా ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం తీసుకొచ్చిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల ద్వారా దాదాపు 60 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వారిలో నుంచి జిల్లాకు ఇచ్చిన టార్గెట్ ప్రకారం శాఖల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభించాలన్నారు. నేడు (శుక్రవారం) మండల స్థాయిలో ఎంపీడీవోలు, బ్యాంకర్ల సమావేశం నిర్వహించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖలు బ్యాంకుల వారీగా దరఖాస్తులను పరిశీలించాలన్నారు. ఎస్‌బీఐ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, యూనియన్ బ్యాంకుల్లో ఎక్కువ దరఖాస్తులు వచ్చాయని లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలన్నారు. సంబంధిత శాఖల వారీగా, బ్యాంకర్ల వారీగా సిద్ధం చేసిన లబ్ధిదారుల జాబితాను మే 21లోగా కలెక్టర్ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎల్డిఎం హరిబాబు, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విజయ భార్గవ్, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ, సెట్విన్, పరిశ్రమలు శాఖల అధికారులు, బ్యాంకర్లు, నాబార్డు ఏజీఎం పాల్గొన్నారు.



అక్కన్నపేటలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పక్కన కలెక్టర్ మనుచౌదరి

భూ భారతితో

సమస్యలు పరిష్కారం

- ధరణి వచ్చిన తర్వాత భూముల పంచాయతీలు
- ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే రాజకీయాలకు అతీతంగా వాటిని కాపాడుకుందాం
- జూన్ 2 నుంచి క్షేత్రస్థాయిలో భూ భారతి చట్టం అమలు
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్/అక్కన్నపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు రైతుల భూములకు రక్షణగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో, అక్కన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతి ఆర్‌వోఆర్ చట్టంపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. కలెక్టర్ మను చౌదరితో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధరణి పోర్టల్ ద్వారా రాష్ట్రంలో 30 నుంచి 40 లక్షల మంది ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రజాపాలన ప్రభుత్వం రైతులందరికీ అనుకూలంగా ఉండేందుకే భూభారతి చట్టాన్ని తీసుకు వచ్చిందని చెప్పా రు. ఎవరైనా ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ భూములను కాపాడుకోవాలన్నారు. భూ వివాదాలు ఏమైనా ఉంటే గతంలోలా కోర్టుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా భూ భారతి ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సమస్యను బట్టి తహసీల్దార్ స్థాయి నుంచి కలెక్టర్ వరకు వెళ్లి భూ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. కొత్త ఆర్‌వోఆర్ చట్టంపై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో అవగాహన సదస్సులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. భూభారతి చట్టం జూన్ 2నుంచి అమల్లోకి వస్తుందన్నారు. త్వరలోనే భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి, గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల నిర్మాణం పూర్తి చేసి సాగు నీరు అందిస్తామని మంత్రి తెలిపారు. భూ భారతిపై కొందరు రైతుల నుంచి వచ్చిన సందేహాలను మంత్రి, అధికారులు నివృత్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్టీఏ సభ్యులు సూర్య వర్మ, మార్కెట్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ బంక చందు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య పాల్గొన్నారు.

రైతులకు సర్కార్

గుడ్‌న్యూస్

- వానాకాలం సీజన్ నుంచి పంటల బీమా అమలు
- ఆయా పంటలకు వర్తింపు
- ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించే అవకాశం...
- త్వరలోనే పూర్తిస్థాయి మార్గదర్శకాలు

గజ్వేల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల క్రితం గత రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన పంటల బీమా పథకాన్ని తాజాగా కాంగ్రెస్ సర్కారు పునరుద్ధరించనున్నది. ఈ మేరకు మార్గదర్శకాలను సిద్ధం చేయాలని ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏఏ పంటలు వేస్తారో... ప్రకృతి విపత్తులతో కలిగే నష్టం ఆధారంగా రాష్ట్రాన్ని 11 క్లస్టర్లుగా వ్యవసాయ శాఖ విభజించింది. నష్టాల వారీగా ఆయా పంటలను ఎంపిక చేసి వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని వర్తింప చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు వచ్చే వానాకాలం సీజన్ నుంచి రాష్ట్రంలోని రైతుల పంటలకు బీమాను వర్తింపచేసేందుకు ప్రణాళిక చేయడంతో పాటు ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

యేటా యాసంగిలో పంటలకు నష్టం

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ప్రతి యేటా యాసంగిలో వడగళ్ల వర్షానికి పంటలకు నష్టం వాటిల్లుతుంది. బీమా పథకం అమల్లో లేకపోవడంతో రైతులకు పంట నష్టం అందకపోవడంతో అప్పుల్లో కూరుకుపోతున్నారు. ముఖ్యంగా చిన్నకోడూరు, నంగునూరు, అక్కన్నపేట, కోహెడ, వర్గల్, జగదేవ్‌పూర్ మండలాల్లో యాసంగిలో ఆయా పంటలకు నష్టం వాటిల్లుతుంది. గడిచిన నాలుగైదు ఏళ్లలో ఇవే మండలాల్లో పది నుంచి 20 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో యాసంగిలో పంటలు నాటాలంటే రైతులు జంకుతున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమల్లోకి తెస్తుండడం రైతాంగానికి కొంత ఊరట నిచ్చేదిగా ఉంది.

జిల్లాలో 5.30 లక్షల ఎకరాల్లో పంటల సాగు

జిల్లాలో 5.30 లక్షల ఎకరాల్లో ఆయా పంటలను రైతులు సాగు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో 5.30 లక్షల ఎకరాల్లో పంటలను సాగు చేస్తుండగా, యాసంగిలో 3.80 లక్షల ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు. అత్యధికంగా వరి సాగు చేస్తుండగా, రెండోస్థానంలో పత్తిని సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా భారీ సాగు నీటి జలాశయాలు అందుబాటులోకి రావడంతో రైతులంతా వరివైపే మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలోనే వడగళ్ల దాటికి వరి పంటకే ఎక్కువ మొత్తంలో నష్టం వాటిల్లుతుంది. జిల్లాలో వానాకాలంలో 3.10 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్న రైతులు, పత్తిని లక్ష ఎకరాల్లో, మొక్కజొన్న 40వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. యాసంగిలో వరి పంటను 3.40 లక్షల ఎకరాల్లో సాగు చేస్తుండగా, ఇతర పంటలను మరో 40వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వరి పంటకు సంబంధించి గ్రామం యూనిట్‌గా బీమా పథకాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.



అకాల వర్షం.. మిగిల్చిన నష్టం



బెజ్జంకి మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లో వరి నెలకొరిగింది. లక్ష్మీపూర్‌లో మామిడికాయలు నేలరాలాయి. ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యాన్ని తడవకుండా కాపాడుకోవడానికి అన్నదాతలు నానా ఇబ్బందులు పడ్డారు.

బెజ్జంకి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి)

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందిన సంఘటన బెజ్జంకి, వర్గల్, మర్కుక్ మండలాల్లో గురువారం చోటు చేసుకున్నది.

బెజ్జంకి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. బెజ్జంకి మండలంలోని బెజ్జంకి క్రాసింగ్ గ్రామానికి చెందిన బీరెడ్డి నక్షత్రమ్మ(55), ఆమె భర్త ఆనందరెడ్డి, దాచారం గ్రామానికి చెందిన కొలిపాక మంజుల(ప్రభుత్వ ఉద్యోగి), గుగిళ్ల గ్రామానికి చెందిన పొన్నం సాయికృష్ణ(బీటెక్ విద్యార్థి), బెజ్జంకికి చెందిన ఐలేని నవీన్‌రెడ్డి కరీంనగర్‌కు వెళ్లేందుకు గురువారం ఉదయం బెజ్జంకి క్రాసింగ్ వద్ద ఓ ఆటోలో ఎక్కారు. రేణికుంట వద్ద రాజీవ్ రహదారిపై వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఓ లారీ ఢీ కొట్టింది. ప్రమాదంలో గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నక్షత్రమ్మ మృతిచెందింది. ఆనందరెడ్డి, మంజుల, సాయికృష్ణ, నవీన్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆనందరెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. నక్షత్రమ్మ మృతితో బెజ్జంకి క్రాసింగ్ గ్రామంలో విషాదం నెలకొంది.

వెనక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొని..

వర్గల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మర్కుక్ మండలం ఎర్రవల్లికి చెందిన గణేశ్(40) భార్య పద్మ, కుమారుడు మనోజ్, కూతురు మానసతో కలిసి కొంతకాలంగా గజ్వేల్ పట్టణంలో నివాసముంటున్నాడు. గురువారం సాయంత్రం గజ్వేల్ నుంచి గౌరారం వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. గౌరారం సమీపంలోని సింగాయిపల్లి క్రాస్ రోడ్డు వద్ద వెనక నుంచి వచ్చిన (టీజీ 08 ఏ 6615) నంబరు గల ద్విచక్ర వాహనం ఢీకొనడంతో కిందపడ్డాడు. ఈ ఘటనలో గణేశ్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యువకుడి పైనుంచి టిప్పర్ వెళ్లడంతో..

మర్కుక్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నిద్రిస్తున్న యువకుడి పైనుంచి టిప్పర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మర్కుక్ మండలం కర్కపట్లకు చెందిన ఓ వ్యక్తి గ్రామంలోని ఓ రైతుకు ప్రభుత్వ భూమి నుంచి మట్టిని టిప్పర్‌లో బుధవారం రాత్రి తరలిస్తున్నాడు. సుమారు ఒంటిగంట ప్రాంతంలో టిప్పర్‌లో ఎక్స్‌కవేటర్ సహాయంతో మట్టి నింపుతుండగా.. మరో టిప్పర్ ఆగి ఉన్నది. ఆగి ఉన్న టిప్పర్ వెనకాల కర్కపట్ల గ్రామానికి చెందిన భీమని కరుణాకర్(24) నిద్రిస్తున్నాడు. ఇది గమనించని టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని వెనక్కి తీశాడు. టిప్పర్ యువకుడి పైనుంచి వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. కుటుంబీకులు చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

జహీరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతిచెందింది. నాగర్‌కర్నూల్- ఈదులకుంటతండాకు చెందిన గంషీబాయి(55) తన కుమారుడు మూడావత్ రాజుతో కలిసి రెండు నెలల క్రితం జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్ శివారులో గల ఓ వెంచర్‌లో పనిచేసేందుకు వచ్చింది. అయితే ఈనెల 19న ఆమె అదృశ్యమైంది. కుమారుడు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా గురువారం వెంచర్‌లోని సంప్‌హౌజ్‌లో శవమై కనిపించింది. కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

సంపులో పడి వ్యక్తి...

ములుగు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సంపులో పడి వ్యక్తి మృతిచెందాడు. ములుగు మండలం తునికిబొల్లారం గ్రామానికి చెందిన బద్దం బలవంతరెడ్డి(34) గురువారం ఉదయం తన వ్యవసాయ పొలం వద్ద నీటి సంపులో మోటార్ నడపడం లేదని చూస్తున్న క్రమంలో కాలుజారి పడిపోయాడు. వెంటనే తన తమ్ముడు కోటిరెడ్డి తాళ్ల సహాయంతో బయటకు తీసే క్రమంలో అప్పటికే నీట మునిగిపోయాడు. అతడిని బయటకు తీసి దగ్గరలోని ఆర్వీఎం ఆస్పత్రికి తీసుకురాగా.. పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

తొగుట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధతో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తొగుట మండలం ఎల్లారెడ్డిపేటకు చెందిన మన్నె భాస్కర్(3) కూలీ పనులతో పాటు ట్యాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుండేవాడు. అతడి భార్య మూడేళ్ల క్రితం మృతిచెందింది. దాంతో తనకున్న పాత ఇంటిపై ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో రూ.3 లక్షల వరకు అప్పు తీసుకున్నాడు. అంతేకాకుండా గ్రామంలో పంట చిట్టీలే వేసి అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం లేక భాస్కర్ తాగుడుకు బానిసయ్యాడు. గురువారం ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీపీ గంట రేణుక రవిందర్ కోరారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నర్సాపూర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. నర్సాపూర్ మండలం ఎల్లారెడ్డిగూడతండాకు చెందిన నేనావత్‌జాంగిర్(35) కుటుంబపోషణ భారంగా భావించి ఈనెల 12న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే నర్సాపూర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందినట్లు ఎస్ఐ లింగం చెప్పారు.

లింగాపూర్‌లో యువతి అదృశ్యం

నర్సాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఓ యువతి అదృశ్యమైన సంఘటన నర్సాపూర్ మండలం లింగాపూర్‌లో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన కంచర్ల కృష్ణవేణి(19) బుధవారం నర్సాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి కుటుంబసభ్యులతో కలిసి వచ్చింది. తల్లి చంద్రకళతో పాటు బంధువులు డాక్టర్‌కు చూపించుకోవడానికి వెళ్లగా కృష్ణవేణి బయట రిసెప్షన్‌లో కూర్చుని ఉంది. బయటకు వచ్చిన తల్లికి కృష్ణవేణి కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇంటర్మీడియట్‌లో తెలుగు తప్పక చదవాలి

జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐతా చంద్రయ్య



మాట్లాడుతున్న జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రయ్య

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్‌లో తెలుగు భాష తప్పక చదవాలని, దీని స్థానంలో సంస్కృతం ప్రవేశపెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయం మానుకోవాలని జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐతా చంద్రయ్య సూచించారు. గురువారం సిద్దిపేటలోని శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. పరిపాలన భాషగా ప్రతీ కార్యాలయం తెలుగు భాష ద్వారానే కార్యకలాపాలు కొనసాగించాలన్నారు. అధికార భాష హోదా దక్కిన తెలుగును కళాశాల విద్యలో తొలగించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఎన్నవెళ్లి రాజమౌళి మాట్లాడుతూ తెలుగు భాష ఉన్నంతకాలమే మనకు గౌరవం దక్కుతుందని, ఇతర భాష వల్ల వెనుకబడి పోతున్నామన్నారు. జాతీయ సాహిత్య పరిషత్ ప్రధాన కార్యదర్శి ఉండ్రాళ్ల రాజేశం మాట్లాడుతూ మార్కుల కోసం ఇంటర్మీడియట్‌లో సంస్కృతం విద్యార్థులకు అనువుగా మారిందని, అందువల్ల తెలుగు భాషకు ముప్పు కలుగుతుందని తెలిపారు. తెలుగు భాష గౌరవం దక్కాలంటే ఇంటర్మీడియట్‌లో ప్రతీ ఒక్కరు తెలుగు చదివేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలోనూ ఈ విషయాన్ని ఎన్నోసార్లు ప్రస్తావించామన్నారు. తెలుగు భాష మూలంగానే అన్య భాషలకు గౌరవం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి బస్వ రాజుకుమార్, చీకోటి రాములు, వంగరి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్

సంగారెడ్డి ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీ చంద్ర

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జూన్ 9వ తేదీ నుంచి 14 వరకు జిల్లా కోర్టు ఆవరణలో చెక్ బౌన్స్ కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్ర తెలిపారు. జిల్లా కోర్టు సమావేశ మందిరంలో గురువారం బ్యాంకు అధికారులు, చిట్‌ఫండ్స్ యాజమాన్యాలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇరువర్గాలు చిన్నచిన్న తగాదాలు పడి కేసులు నమోదు చేసుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ తమ విలువైన సమాయాన్ని వృథా చేసుకోకుండా రాజీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నిర్మానుష్యంగా దిగ్వాల్‌లోని 65వ నంబర్ జాతీయ రహదారి

ఎండ ప్రచండం

నిప్పుల కొలిమిలా ఉమ్మడి మెదక్ జిల్లా

నాలుగు రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

మెదక్ జిల్లా పొడ్చన్‌పల్లిలో రికార్డ్‌స్థాయిలో 44.3 డిగ్రీలు

119 గ్రామాల్లో 40 డిగ్రీలకుపైగా నమోదు

మెదక్/కోహీర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. నాలుగు రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా 40 డిగ్రీల దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని పొడ్చన్‌పల్లిలో ఈ వేసవిలోనే రికార్డ్‌స్థాయిలో 44.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేటలో 43.4 డిగ్రీలు, అలాగే సంగారెడ్డి జిల్లాలోని వట్‌పల్లి మండలంలోని పల్వట్లలో 42.7 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మూడేళ్ల తర్వాత ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. 2022 నుంచి పరిశీలిస్తే ఏప్రిల్ 23 నాటికి వరుసగా 38.6, 39.1, 42.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఏడాది ఏకంగా 44.3 డిగ్రీలకు చేరుకుని ఆందోళనను కలిగిస్తున్నది. గురువారం మెదక్, సిద్దిపేట జిల్లాలోని 20 ప్రాంతాలలో 43 డిగ్రీల కంటే పైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే 119 ప్రాంతాలలో 40 నుంచి 44 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సుర్రుమంటున్న సూర్యుడు

ఉదయం 9 గంటల నుంచే సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఎండల తీవ్రతకు జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం వరకు వీస్తున్న తీవ్రమైన వేడిగాలులతో సతమతమవుతున్నారు. మధ్యాహ్న సమయంలో ద్విచక్ర వాహనాలు ప్రధాన రోడ్లపైన కనిపించడం లేదు. పట్టణాలతో పాటు పల్లెల్లోనూ మధ్యాహ్నం వేళ జనసంచారం తగ్గింది. ఉమ్మడి జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లోని ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. పనులున్న వారు ఉదయమే ముగించుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు. సాయంత్రం వేళ బయటకు వస్తున్నారు. ధాన్యం ఆరబెడుతున్న రైతులు, ఉద్యోగాలకు వెళ్లే వారు, ఇతర పనుల నిమిత్తం జిల్లా కేంద్రాలకు వచ్చే వారు ఎండలకు వేసారిపోతున్నారు. అవసరమైతే తప్ప బయటకు రావొద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయితే, ఈ వేసవిలో ఇప్పటివరకు వడదెబ్బ కారణంగా అనారోగ్యానికి గురైనట్లు తమ రికార్డులలో నమోదు కాలేదని మెదక్ జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయ అధికారులు తెలిపారు. ఈ నెల 16న రామాయంపేట పట్టణంలో కూలీ పని చేసుకునే ఎరుకల బాలయ్య మండుటెండలకు అస్వస్థతకు గురై మృతి చెందినప్పటికీ, వడదెబ్బ కారణమని వైద్యారోగ్య శాఖ రికార్డుల్లో పేర్కొనలేదు. పైగా ప్రభుత్వ వైద్యురాలు వివరణ ఇస్తూ మృతుడికి వడదెబ్బ లక్షణాలు లేవని నిర్ధారించారు.



సంగారెడ్డిలో ఓ వృద్ధుడు సొమ్మసిల్లి పడిపోగా అతనికి సపర్యలు చేస్తున్న స్థానికులు

మూడేళ్లలో విపరీతంగా పెరిగాయి



గడచిన మూడు సంవత్సరాల రికార్డులను పరిశీలిస్తే ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగాయి. పైగా మండుటెండల్లో వడగండ్ల వానలు, ఈదురుగాలులతో ప్రకృతి ప్రకోపిస్తోంది. పర్యావరణ కాలుష్య దుష్ప్రభావంతోనే ఈ విధంగా పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. 2022లో ఏప్రిల్‌లో 38.6 డిగ్రీలు నమోదు కాగా 2025 ఏప్రిల్ 24న 44.3 డిగ్రీలు నమోదవడం పరిశీలిస్తే వాతావరణంలో ఏటా చోటుచేసుకుంటున్న మార్పులు అవగతమవుతాయి.

\- బద్రీనాథ్, మెదక్ జిల్లా గణాంక అధికారి

మెదక్ జిల్లాలో

పొడ్చన్‌పల్లి 44.3, నర్సాపూర్ 43.7, పాతూర్ 43.6, దామరంచ 43.6, శివ్వంపేట్ 43.5, కొడిపల్లి 43.5, కుల్చారం 43.5, మాసాయిపేట్ 43.3, వడ్డీ 43.3, చిట్కుల్ 43.2, మెదక్ 43.2, అల్లాదుర్గ 43.1, శంకరంపేట్(ఆర్) 43.1, రాజ్‌పల్లి 42.9, కొత్తపేట్ 42.8, వెల్దుర్తి 42.8 టేక్మాల్ 42.8, సర్దన 42.7, నర్లాపూర్ 42.6, చేగుంట 42.6, మినీపూర్ 42.2, శంకరంపేట(ఏ) 42.1, శివనూర్ 42.1, చిప్పల్‌తుర్తి 42.1, లింగాయపల్లి 42.0, బోడమాట్ 42.0, రేగోడు 41.7, ఇస్లాంపూర్ 41.5, కాగజ్‌మద్దూర్ 41.3, దొంగలధర్మారం 41.1, లక్ష్మాపూర్ 41.1, మొయినాబాద్ 40.9, రామయంపేట్ 40.7 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సిద్దిపేట జిల్లాలో..

సిద్దిపేట 43.4, రాఘవపూర్ 43.3, శనివారం 43.3, సముద్రాల 43.2, కోహెడ 43.1, నారాయణపేట్ 43.0, బెజ్జంకి 43.0, చిట్యాల 42.9 పోతరెడ్డిపెట్ 42.9 తుక్కాపూర్ 42.8 హబ్సీపూర్ 42.8 హుస్నాబాద్ 42.8, దౌల్తాబాద్ 42.7, రేబర్తి 42.6, పెద్దకోడూరు 42.6, వెంకటరావుపేట్ 42.2, బెజుగావ్ 42.1, తిప్పారం 42.1, ముస్త్యాల 42.1, గండిపల్లి 42.0, బేగంపేట్ 42.0, మిరుదొడ్డి 41.8, లకుడారం 41.8, గౌరారం 41.8, నంగనూరు 41.7, రాంపూర్ 41.6, మునిగండప్ప 41.6, ధూళ్మిట్ట 41.5, కొమురవెల్లి 41.4, కొడకండ్ల 41.4, చికోడ్ 41.4, గజ్వేల్ 41.3, అంగడికిష్టాపూర్ 41.2, కట్కూర్ 41.1, చాట్లపల్లి 40.8, కొండపాక 40.8, ములుగు 40.7, రామారం 40.6, ములుగు 40.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సంగారెడ్డి జిల్లాలో

పాల్వట్ల 42.7, నిజాంపేట్ 42.7 మల్‌చెల్మ 42.6, నారాయణఖేడ్ 42.6, లక్ష్మీసాగర్ 42.6, సింగాపూర్ 42.5, కల్హేర్ 42.4, సత్వర్ 42.4, వట్‌పల్లి 42.4, కడ్పల్ 42.3, కంగ్టి 42.2, నాగలిగిద్ద 42.1 సుల్తాపూర్ 42.1, దిగ్వాల్ 42.1, హత్నూర 42.0, కంది 42.0, పుల్కల్ 41.9, చౌటకూర్ 41.9 అల్లోల్ 41.9, జిన్నారం 41.8, గుండ్లమచునూరు 41.8, ముక్తాపూర్ 41.8, న్యాల్‌కల్ 41.7, కొండాపూర్ 41.7, మొగుడంపల్లి 41.6, మనూర్ 41.6, పాశమైలారం 41.6, గుమ్మడిదల 41.6, రాయికోడు41.5, రుద్రారం 41.4, కిష్టారెడ్డిపేట్ 41.4, రామచంద్రపురం 41.4, సంగారెడ్డి 41.3, జహీరాబాద్ 41.2, బిహెచ్‌ఈఎల్ 41.2, ఝరాసంఘం 41.2, పటాన్‌చెరు 41.2, ఆల్మాయిపేట్ 41.1, సదాశివపేట 41.1, మునిపల్లి 41.0, కోహీర్ 40.9 అన్నసాగర్ 40.8, కంకోల్ 40.5, నల్లవల్లి 40.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



రజతోత్సవ అభిమానం

చేర్యాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభ ఈనెల 27వతేదీన జరగనున్న నేపథ్యంలో చేర్యాల పట్టణానికి చెందిన జి.మనోహర్ ప్రత్యేక వేషధారణతో వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తూ తన అభిమానాన్ని చాటుకుంటున్నాడు. సూర్యభగవానుడి తరహా రూపంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత చిత్రాలు రూపొందించిన గులాబీరంగు ఫ్లెక్సీని ధరించాడు. చేత మెగామైక్ పట్టుకుని రజతోత్సవ సభకు తరలిరావాలని, గులాబీ జెండాయే అండ అని సూచిస్తున్నాడు. ఎండలు మండిపోతున్న నేపథ్యంలో నెత్తిన గొడుగు పట్టుకుని సభకు తరలిరావాలంటూ అభ్యర్థించడాన్ని చూసి స్థానికులు ఆయనను అభినందించారు.

ఆరు వారాలు ‘రైతు ముంగిట శాస్త్రవేత్త’

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం

మే నెల 5 నుంచి ప్రారంభం

రైతులకు అవగాహన కల్పించనున్న శాస్త్రవేత్తలు

వచ్చే సీజన్ నుంచి గ్రామాల్లోనే విత్తనోత్పత్తి దిశగా సన్నాహాలు

గ్రామానికి ఐదుగురి చొప్పున రైతుల ఎంపిక

గజ్వేల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పలు అంశాలపై అవగాహన వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. రైతు ముంగిట శాస్త్రవేత్తలు పేరిట మే 5 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆరు వారాల పాటు నిర్వహించనున్నారు. జూన్ 13 వరకు కొనసాగుతుంది. రాష్ట్రంలోని 415 మంది శాస్త్రవేత్తలు, 200 గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. ఈ క్రమంలోనే సిద్దిపేట జిల్లాలోని 26 మండలాలకు గాను 24 మండలాలను ఎంపిక చేశారు. మండలానికి ఒక గ్రామానికి చొప్పున 24 గ్రామాల రైతులకు ఆయా అంశాలపై అవగాహన కల్పించనున్నారు.

విత్తన ఎంపికపై అవగాహన

రైతులు ముఖ్యంగా విత్తన ఎంపిక కీలకమని గుర్తించడం, విత్తనం తీసుకున్న వెంటనే రసీదును తీసుకోవాలని తద్వారా కలిగే ప్రయోజనాలను వివరించనున్నారు. పంట మార్పిడి వైపు ప్రోత్సహిస్తారు. పత్తి, వరి కొయ్యలు కాల్చడంతో కలిగే నష్టాలు, అధికంగా యూరియా(నత్రజని) వాడకంతో కలిగే దుష్ప్రభావాలను తెలపనున్నారు. వేసవి దుక్కులు, పచ్చిరొట్టె విత్తన సాగుతో కలిగే ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై శాస్త్రవేత్తలు గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఇందుకు సిద్దిపేట జిల్లాలోని 24 మండలాల్లో నాలుగు బృందాలు మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసుకుని అవగాహన కల్పించనున్నారు. ఈ బృందంలో ఇద్దరు శాస్త్రవేత్తలు, ఇద్దరు బీఎస్సీ లేదా పాలిటెక్నిక్ డిప్లొమా చదువుతున్న విద్యార్థులు, వ్యవసాయశాఖ అధికారులు ఉండనున్నారు. ఆయా గ్రామాల్లోని రైతువేదికలు, పంచాయతీ కార్యాలయాల వద్ద రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ కార్యక్రమాన్ని శాస్త్రవేత్త శ్రీదేవీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త (ఫైల్)

విత్తనోత్పత్తికి ప్రణాళిక

గ్రామాల్లోనే నాణ్యమైన విత్తనాలను తయారు చేయాలన్న సంకల్పంతో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రభుత్వ సహకారంతో ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ యాసంగి లేదా వచ్చే రబీ సీజన్‌లో ఈ ప్రణాళికను ఆచరణలో పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామానికి ఐదుగురు రైతుల చొప్పున ఎంపిక చేసి వారికి యూనివర్సిటీ ఆధ్వర్యంలో రీసెర్చ్ చేసిన వంగడాలను అందజేసి గ్రామస్థాయిలో నాణ్యమైన విత్తనాలను తయారు చేసేందుకు కసరత్తు చేశారు. ఇప్పటికే జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆసక్తి గల రైతుల జాబితాను ప్రభుత్వానికి నివేదించారు. ఈ రైతులకు వరి, మినుములు, కందులు వంటి వంగడాలను అందజేసి విత్తనోత్పత్తిని గ్రామాల్లోనే చేసి రైతులపై విత్తన భారం పడకుండా చూసేందుకు యత్నాలు చేస్తున్నారు.

బీఈఎల్‌కు గీతం విద్యార్థుల ఎంపిక







భట్టు సాయిశ్రీజ, గాయత్రి రచన త్రిపురాణ, కక్కిరేణి మణికంఠ

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈసీఈ విభాగం చివరి ఏడాదికి చెందిన ముగ్గురు విద్యార్థులు భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)కు ఎంపికయ్యారు. భట్టు సాయిశ్రీజ, గాయత్రి రచన త్రిపురాణ, కక్కిరేణి మణికంఠ ఐదు సంవత్సరాల కాలానికి ఫిక్స్‌డ్ టర్మ్ ఇంజనీర్స్ (ఈ టు గ్రేడ్)గా ఎంపికైనట్టు యూనివర్సిటీ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించింది. విద్యార్థులను గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఆర్ శాస్త్రి, ఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి అభినందించారు.

ఇదే స్ఫూర్తితో చదివి డాక్టర్ కావాలి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థిని మంగళి అక్షయను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో ఉన్నత విద్యనభ్యసిస్తూ డాక్టర్ కావాలని ఆకాంక్షించారు. పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో 1000 మార్కులకు గాను 977 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచి కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చిందని కొనియాడారు. సంగారెడ్డికి చెందిన నిరుపేద కుటుంబంలోని పద్మ, శ్రీశైలం దంపతుల అమ్మాయి అక్షయ ఇంటర్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబర్చిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్, కార్యదర్శి శ్రీశైలం, రాము, అంజనేయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అక్షయను అభినందిస్తున్న కలెక్టర్ క్రాంతి

అన్నవిని అభినందించిన జనగామ కలెక్టర్

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ సంవత్సరంలో స్టేట్ ర్యాంక్ సాధించిన విద్యార్థిని అన్నవిని జనగామ కలెక్టర్ రిజ్వాన్ పాషా అభినందించారు. జగదేవ్‌పూర్ మండలం ధవలాపూర్ గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ డిజి వెంకటేష్ కూతురు దూస అన్నవి జనగామ జిల్లా కొడకండ్లలోని గురుకుల పాఠశాలలో ప్రథమ సంవత్సరం ఎంపీసీ చదువుతుంది. ఇటీవల ఇంటర్ ఫలితాలు రావడంతో 470 మార్కులకు 467 మార్కులు సాధించి స్టేట్‌లో రెండె ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ పాషా విద్యార్థినిని గురువారం ప్రత్యేకంగా అభినందించారు.

మహాశివుడి చెంత మహాభాగ్యం

కేదార్‌నాథ్‌లో సిద్దిపేట వాసుల అన్నదానం

నేడు వెళ్లనున్న సరుకుల లారీలు

రెండు నెలల పాటు నిత్యాన్నదాన శిబిరం

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కేదార్‌నాథ్‌లో అన్నదాన శిబిరానికి అవసరమైన సరుకుల వాహనాలకు ప్రత్యేక పూజల అనంతరం శుక్రవారం సిద్దిపేట శరభేశ్వరాలయం వద్ద నుంచి కేదార్‌నాథ్‌కు బయలుదేరనున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక, ఎంపీ రఘునందన్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ పాల్గొంటారని కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు చీకోటి మధుసూదన్, ప్రధాన కార్యదర్శి అయిత రత్నాకర్, కోశాధికారి గోపిశెట్టి శరభయ్య, పీఆర్వో మంకాల నవీన్ కుమార్, సమితి సభ్యులు తెలిపారు. గురువారం సిద్దిపేటలోని పాతగంజి హనుమాన్ ఆలయంలో అన్నదానం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు.




కరపత్రం ఆవిష్కరిస్తున్న కేధార్‌నాథ్ అన్నదాన సేవ సమితి సభ్యులు

మొదటి తెలుగు లంగర్

సిద్దిపేటకు చెందిన కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి సభ్యులు 2019లో సేవాసమితిని ప్రారంభించారు. ఈ సేవా సమితిలో ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు గౌరవ సభ్యులుగా ఉన్నారు. సమితి సభ్యుల చొరవ, దాతల సహకారంతో ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ స్వామి చెంత దక్షిణ భారతదేశంలోనే మొదటి తెలుగు వారి అన్నదాన శిబిరం (లంగర్) ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు నాలుగు పర్యాయయాలు అన్నదాన శిబిరం కొనసాగింది. ఈసారి ఐదోసారి ఏర్పాటు చేస్తున్నారు. కేదారేశ్వరుడి ఆలయానికి సుమారు 20 కిలోమీటర్ల దూరంలోని సోన్ ప్రయాగ్ బేస్ క్యాంపు పార్కింగ్ సముదాయం దగ్గర సిద్దిపేట వారి శిబిరం ఉంటుంది. అలాగే కేదార్‌నాథ్ ఆలయానికి దగ్గరగా మరో అన్నదాన కేంద్రాన్ని భక్తుల కోరిక మేరకు ప్రారంభించారు. ఇక్కడికి భక్తులు ఎక్కువగా వచ్చే రెండు నెలల పాటు ప్రతీరోజు శిబిరం కొనసాగుతుంది. రోజూ దాదాపు 10 వేల మంది ఈ శిబిరం ద్వారా ఆకలి తీర్చుకుంటారు.

మంచుకొండల్లో మైమరిపించే రుచులు

మంచుకొండలో వెలిసిన దేవదేవుడి దర్శనం అంటే మామూలు విషయం కాదు. చుట్టూ మంచు కొండలు.. లోయలు మైనస్ డిగ్రీ ఉష్ణోగ్రతలు.. భిన్న వాతావరణ పరిస్థితులు ఉంటాయి. అలాంటి చోట సిద్దిపేట కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి భక్తులకు రుచికరమైన వంటలు వడిస్తూ శివ భక్తుల మన్ననలు పొందుతున్నది. ఎన్నో వ్యయప్రయాసలతో వచ్చే భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం, రాత్రి భోజనం అందించనున్నారు. అన్నం, పులిహోర, పెరుగన్నం, అల్పాహారాలు, మిఠాయిలు, పానీపూరి వరకు అన్ని రుచికరమైన వంటలను సమకూర్చుతున్నారు. కొంత మంది కోరిక మేరకు టీ, కాఫీలను అందిస్తారు. గతంలో ఒక లారీలో సరుకులు కేదార్‌నాథ్ వెళ్లేవి కానీ, ఈ సంవత్సరం 15 నుంచి 20 లక్షల విలువైన సరుకులు రెండు లారీల్లో వెళ్లనున్నాయి. ఇవే కాకుండా అక్కడ స్థానికంగా గ్యాస్, కూరగాయలు, పాలు వంటి వస్తువులు కొనుగోలు చేయాల్సి వస్తుంది. అలాగే ట్రాన్స్‌పోర్టుకు కూడా లక్షల్లో ఉంటుంది. సహకరిస్తున్న దాతలకు సమితి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.





పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

పాలమాకుల నుంచి వెంకటాపూర్ వెళ్లే దారిలో చెట్లను విద్యుత్ అధికారులు వైర్లకు తాకుతున్నాయని కొట్టివేశారు. ప్రస్తుతం ఎండ తీవ్రతకు నీడ కరువైందని రోడ్డు వెంట వెళ్లే పలువురు విద్యుత్ శాఖపై మండిపడుతున్నారు.

\- నంగునూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి)

బట్టర్ మిల్క్ ఫర్ బెట్టర్ హెల్త్

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో బట్టర్ మిల్క్ ఫర్ బెట్టర్ హెల్త్ అనే ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన సృజనాత్మక ఆరోగ్య పరమైన పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ప్రిన్సిపల్ డా. సునీత మాట్లాడుతూ వేసవికాలంలో బట్టర్ మిల్క్ సేవనం శరీరాన్ని హైడ్రేడ్ చేయడంలో ఎంతో మేలు చేయడంతో పాటుగా జీర్ణ శక్తిని పెంపొందించే ప్రకృతి సిద్ధమైన మార్గాల్లో ఒకటి అని అన్నారు. అంతకు ముందు మైక్రోబయాలజీ విభాగాధిపతి డా. జి. మదన్ మోహన్ మాట్లాడుతూ బట్టర్ మిల్క్ తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగవుతుందని, శరీరంలోని వేడిని తగ్గిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో పిల్లలలో లోపాన్ని తగ్గించవచ్చు



గ్రాడ్యుయేషన్ డే లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సిబ్బంది, టీచర్స్ తదితరులు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) :పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారమే ముఖ్యమని ఐసిడిఎస్ సూపర్వైజర్ సునీత అన్నారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం బొగ్గులోని బండ గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి హాజరై ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని తద్వారా వారికి పౌష్టికాహారం అందుతుందన్నారు. గర్భం దాల్చిన ప్రతి మహిళ అందుబాటులోని అంగన్వాడీ కేంద్రంలో నమోదు చేసుకోవాలని చెప్పారు. బాలింతలు తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాల లోనే మధ్యాహ్న భోజనం చేయాలని సూచించారు.పోషణ పక్వడ పురస్కరించుకుని వివిధ రకాల పౌష్టికాహార పదార్థాలు తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ స్వప్న, హెల్పర్ యాదమ్మ,గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



అగ్నిగుండాలు దాటుతున్న భక్తులు

గజ్వేల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని శ్రీసీతారామ, ఉమామహేశ్వర స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి భద్రకాళీ పూజ నిర్వహించిన అనంతరం గురువారం ఉదయం అగ్నిగుండాలు దాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఉత్సవ విగ్రహాలతో గరుడ వాహన సేవ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ, పూజారుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకుని తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు రాజశేఖరశర్మ, తదితరులున్నారు.

ఐనాపూర్ మాజీ సర్పంచ్ మృతి

చేర్యాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నిస్వార్థ, నిరాడంబర రాజకీయాలకు నిదర్శనమైన కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామ మాజీసర్పంచ్ కాయిత పందికాల్వ బాల్‌రెడ్డి(68) గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. గతంలో మూడు దఫాలు పంచాయతీ ఎన్నికలలో సర్పంచుగా ఏకగ్రీవంగా ఎన్నికైన బాల్‌రెడ్డి ఐనాపూర్ గ్రామాభివృద్ధితో పాటు మౌళికవసతులకల్పనకు పాటుపడ్డాడు. కొంతకాలంక్రితం అనారోగ్యానికి గురవగా, గురువారం కన్నుమూశారు. బాల్‌రెడ్డి మృతి పట్ల గ్రామస్తులు, పలు రాజకీయ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తంచేశారు. గ్రామానికి అందించిన సేవలను గుర్తుచేసుకుని నివాళులర్పించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ఎదగాలి

- కొమురవెల్లి ఎంఈవో రమేశ్



జడ్పీఎస్ఎస్ వార్షికోత్సవంలో సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

చేర్యాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో మెదలుతు ప్రణాళికాపరంగా చదువుకుని ఉన్నత లక్ష్యంతో ఎదగాలని కొమురవెల్లి ఎంఈవో రమేశ్ అన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక, జడ్పీఎస్ఎస్‌లలో బుధవారం రాత్రి పాఠశాల క్రీడా, వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టారు. అనంతరం ఎంఈవో రమేశ్ మాట్లాడారు.

జాతరలోగా పనులు పూర్తయ్యేనా?

- మే 12 నుంచి ఎల్లమ్మ జాతర ప్రారంభం
- నిలిచిపోయిన అనివేటి మండప పనులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే ఇబ్బందులు తప్పవు



రేణుకా ఎల్లమ్మ దేవి



స్లాబ్ వేసి ఉన్న అనవేటి మండపం పనులు

హుస్నాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోనే ప్రసిద్ధి చెందిన హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతర మరో 18 రోజుల్లో ప్రారంభం కాబోతుంది. కానీ దేవాలయానికి ప్రధానమైన అనివేటి మండప నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. మే 12 నుంచి జూన్ 11వ తేదీ వరకు జాతర జరుగనుండటంతో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి ఈ పనులు ఆగుతూ సాగుతున్నాయి. ఎల్లమ్మ జాతరకు ఏయేటికాయేడు భక్తుల రద్దీ పెరుగుతుండటంతో పురాతనమైన మండపాన్ని తొలగించి దాని స్థానంలో అధునాతనంగా అనివేటి మండపాన్ని నిర్మించాలని యోచించారు. దీనికి ప్రభుత్వం రూ. 50 లక్షలు మంజూరు చేసింది. 19 డిసెంబరు 2022న అప్పటి ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఈ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం మారిన తర్వాత 2024 మార్చి 13న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ప్రస్తుతం స్లాబ్ దశలో పనులు నిలిచిపోయాయి. పనులు ప్రారంభమై 13 నెలలు గడిచినా పూర్తి కాకపోవడంతో జాతరలోపు పనులు పూర్తయ్యే అవకాశాలు కనబడటం లేదు.

ఏటా పెరుగుతున్న భక్తుల రద్దీ

ప్రతి ఏటా దాదాపు రెండు లక్షల మందికి పైగా భక్తులు దర్శించుకుంటారు. ప్రతి సంవత్సరం వైశాఖ పౌర్ణమి నుంచి జేష్ఠ పౌర్ణమి వరకు ఎల్లమ్మ జాతర ఘనంగా జరుగుతుంది. ఈ జాతరకు హుస్నాబాద్ చుట్టు ప్రక్కల గ్రామాల నుంచే కాకుండా మహారాష్ట్రలోని చంద్రాపూర్, షోలాపూర్, బీదర్, హైదరాబాద్, నిజామాబాద్, జనగామ, మెదక్, సంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, జగిత్యాల,పెద్దపల్లి, భువనగిరి జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. అమ్మవారికి బోనాలు, సంతానం కోసం దంపతులు కొబ్బరికాయల ముడుపులు కట్టడం, పట్నాలు వేయడం, గండాలు తొలగాలని గండ దీపం వెలిగించడం వంటి కార్యక్రమాలన్నీ ఆలయ అనివేటి మండపంలో చేస్తారు. మండపం చిన్నదిగా ఉండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని ఆగమశాస్త్రం ప్రకారం పాత మండపాన్ని తీసివేసి నూతనంగా అనివేటి మండపాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం స్లాబ్ నిర్మాణం చేయగా ఇంకా శిల్పాలతో విగ్రహాలు, రంగులు, ఇతర పనులు చేయాల్సి ఉంది. మరో 18 రోజుల్లో జాతర ప్రారంభం కానుండటంతో పూర్తయ్యే అవకాశం లేనందున ఎండలు మండుతున్న దృష్ట్యా చలువ పందిర్లు, చుట్టూ టెంట్లు వేసి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరుతున్నారు.

నిరసనల వెల్లువ

- కొవ్వొత్తుల ప్రదర్శనతో నివాళులు
- న్యాయవాదుల విధుల బహిష్కరణ
- హిందువులపై జరిగిన దాడి హేయమైన చర్య

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పహల్గామ్ ఉగ్రదాడి ఘటనపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లావ్యాప్తంగా పలుచోట్ల పార్టీలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో గురువారం కొవ్వొత్తులు, నిరసన ర్యాలీలు తీశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలో ముస్తాబాద్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, నాయకులు గంప మహేందర్, ముద్దం లక్ష్మి, తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు. కోర్టు వద్ద న్యాయవాదులు విధులు బహిష్కరించి, నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యకమంలో న్యాయవాదులు పిన్న రాములు, రమేష్‌బాబు, జనార్దన్‌రెడ్డి, సాయిబాబా, గోవర్ధన్‌రెడ్డి, పాశికంటి శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలోనూ నిరసనలు జరిగాయి.



సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద పహల్గామ్ ఘటనపై నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చేర్యాలలో

కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల గ్రామస్తులు జనగామ- సిద్దిపేట జాతీయ రహదారిపై గురువారం కొవ్వత్తుల ప్రదర్శనతో మృతులకు నివాళులర్పించారు. చేర్యాల మున్సిఫ్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి, కోర్టు నుంచి బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ తీశారు.



కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల గ్రామంలో కొవ్వొత్తుల ప్రదర్శనతో నివాళులర్పిస్తున్న స్థానికులు



చేర్యాలలో విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలో నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

మిరుదొడ్డి

జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో హిందువులపై జరిగిన దాడి హేయమైన చర్యయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేష్‌గౌడ్ అన్నారు. బుధవారం రాత్రి దుబ్బాక, మిరుదొడ్డి మండల కేంద్రాల్లో పహల్గాంఉగ్రవాదులు చేసిన దాడి ఖండిస్తూ క్రొవ్వత్తుల ర్యాలీని నిర్వహించారు.అలాగే మిరుదొడ్డిలో కూడా బీజేపీ నాయకులు క్రొవ్వత్తుల ర్యాలీని నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవరాజు, రాజశేఖర్ తదితరులున్నారు.

వేసవి శిబిరాలు విద్యార్థులకు ఎంతో ప్రయోజనం

వర్గల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం గురించి అధికారులు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి సునీత విద్యార్థులకు సూచించారు. గురువారం వర్గల్ ప్రాథమిక పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 24వ తేది నుంచి మే 1వ తేదీ వరకు పాఠశాలలో శిక్షణ శిబిరం కొనసాగుతుందన్నారు. విద్యార్థులకు పాఠాలతో పాటు వివిధ అంశాలపై విజ్ఞానం ఉండే విధంగా బోధిస్తామన్నారు. నృత్యం, చిత్రలేఖణం, హ్యాండ్ రైటింగ్, క్రాఫ్ట్, గాణం, పద్య పఠనం, సూర్య నమస్కారాలు, యోగ, మెడిటేషన్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మధుసూదన్, తదితరులు ఉన్నారు.



వర్గల్ ప్రాథమిక పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరంను ప్రారంభించిన మండల విద్యాధికారి సునీత

మద్దూరులో

వేసవి శిబిరాలు విద్యార్థులకు ఎంతో ప్రయోజనాలను చేకూరుస్తాయని ఎంఈవో వరదరాజు తెలిపారు. గురు వారం మండలంలోని రేబర్తి ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో విద్యార్థులకు అందిస్తున్న చక్కటి చేతివ్రాత, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీషుతో పాటు పలు అంశాలపై ఇస్తున్న శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కుక్కల ఏరివేత కార్యక్రమం

గజ్వేల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో కుక్కల ఏరివేత కార్యక్రమాన్ని మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. 15వ వార్డుకు చెందిన జంగం రమేశ్‌గౌడ్ కుక్కల బెడద అంశాన్ని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన కమిషనర్ కుక్కల ఏరివేత చర్యలను చేపట్టారు. ఈ సందర్భంగా జంగం రమేశ్‌గౌడ్‌తో పాటు వార్డు సభ్యులు కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హుస్నాబాద్‌లో చోరీ

హుస్నాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణం ఎల్ఐసీ కాలనీలోని జెట్టి వెంకటస్వామి ఇంట్లో గురువారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో తలుపు తాళాలను పగులగొట్టి బీరువాలోని తులం బంగారు, 10 తులాల వెండి ఆభరణలతో పాటు రూ. 20 వేల నగదును దోచుకెళ్ళినట్లు ఎస్ఐ తోట మహేశ్ తెలిపారు. క్లూస్ టీమ్‌ను రప్పించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి అకాల వర్షాల వడగండ్లతో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందివ్వాలని సీపీఎం రాష్ట కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు గురువారం సిద్దిపేటలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాలు, వడగళ్ల వాన,గాలి దుమారాలతో నష్ట పోయిన పంటలకు నష్ట పరిహారం ప్రభుత్వం అందించాలని, వేసవి కాలంలో జిల్లాలో నీటి ఎద్దడిని నివారించాలని అన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లు నత్త నడక సాగుతోందని, కొనుగోలు ఆలస్యం చేయడం వలన అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసిపోయి రైతాంగం నష్ట పోతున్నారని ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లు వేగవతం చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను , సంక్షేమ పథకాలు అమలు చేయడంలో జాప్యం జరుగుతుందని ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు,పెన్షన్లు, భూమి లేని కూలీలకు ప్రభుత్వం ఇస్తామన్న పన్నెండు వేల రూపాయలు ఇవ్వాలని, మహిళలకు ఇరవై ఐదు వందల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో స్థానికంగా పేరుకు పోయిన స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని లేనిపక్షం పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలస్వామి, రాళ్లబండి శశిధర్,జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో, ఆలేటి యాదగిరి, చొప్పరి రవికుమార్,బండకింది అరుణ్ కుమార్, తాడూరి రవీందర్, అమ్ముల బాల నరసయ్య, తిపారంపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభ జయప్రదం చేయాలి

దౌలల్తాబాద్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తిలో 27న మాజీ సీఎం కేసీఆర్ సారథ్యంలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని దౌల్తాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ రైమోద్దీన్ గురువారం మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో మాజీ సర్పంచ్ మోహన్‌రావు ఇంటి వద్ద చలో వరంగల్ గోడ పత్రిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజతోత్సవ సభను విజవంతం చేసేందుకు మండల,గ్రామ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు అందరూ కలిసి కట్టుగా పని చేసి రజతోత్సవ సభకు ప్రజలను,తరలించేందుకు కృషి చేయాలని తెలిపారు.కార్యక్రమంలో దొమ్మాట మాజీ సర్పంచ్ మోహన్‌రావు,శేరిపల్లి బందారం మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో అందరికి భాగస్వామ్యం

ములుగు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ అభివృద్ధిలో అందరూ భాగస్వాములై అభివృద్ధి చేసుకోవాలని ములుగు ఎంపీడీవో స్వర్ణకుమారి తెలిపారు. బుధవారం ములుగు మండలం బండమైలారం గ్రామంలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో జాతీయ ఉపాధిహామీ పనులు నిర్వహించారు. అందులో 270 మంది కూలీలతో పనులు జరిగాయి. సామాజిక తనిఖీలో చేసిన పనుల్లో అన్ని సవ్యంగానే ఉన్నాయని ఆమె తెలిపారు. ఆమె వెంట సూపరిండెంట్ రామచందర్, నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



కన్నులపండుగగా శ్రీవారి కల్యాణం

గజ్వేల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరాయంలో శ్రీగోదా సమేత వెంకటేశ్వరుల కల్యాణాన్ని గురువారం రాత్రి కన్నులపండుగగా నిర్వహించారు.

మా సంగతేంటి..!

5వ పేజీ తరువాయి

చేస్తారో అంతుపట్టడం లేదు. ఇక ఆలయాల పాలకవర్గాలకు సంబంధించిన జాబితాలదీ ఇదే పరిస్థితి. ఇప్పటికే బహిరంగమైన ఓ ఆలయ కమిటీపై వివాదం రాజుకుంది. కమిటీలను ప్రకటిస్తే కొత్త సమస్యలు ఎదురవుతాయనే కోణంలో పార్టీ అధిష్ఠానం కూడా ఆచితూచి వ్యవహరిస్తున్నట్లుగా అర్థమవుతోంది. 'సుడా'పై సందిగ్ధంసిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) పదవులపై సందిగ్ధం నెలకొన్నది. మొన్నటి దాకా సిద్దిపేటతో పాటు 21 గ్రామాలకే పరిమితమైన 'సుడా'ను ఇటీవల జిల్లా మొత్తం విస్తరిస్తున్నట్లు ప్రకటించారు. కానీ ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. గతంలో సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన వ్యక్తులకే చైర్మన్, డైరెక్టర్ పదవులు ఇచ్చారు. ఈ సారి కూడా సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన వారికే పదవులు కేటాయించాలని స్థానికంగా డిమాండ్ చేస్తున్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు, హుస్నాబాద్ నియోజకవర్గంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉన్నందున సిద్దిపేటకే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. 'సుడా' పదవుల కోసం సీఎం స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. తప్పని ఎదురుచూపులుకాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులను ప్రకటించారు. ఇందులో సిద్దిపేట జిల్లాకు కనీసం ఒక్క పోస్టు కూడా రాలేదు. చైర్మన్ పదవుల రేసులో ఉన్నవాళ్లంతా నిరుత్సాహానికి లోనవుతున్నారు. ఇక నామినేటెడ్ పోస్టులపరంగానూ ఒక్కొక్కటిగా ప్రకటిస్తున్నారు. ముందుగా హుస్నాబాద్ నియోజకవర్గంలో పలు కమిటీలను ప్రకటించారు. ఆనాడు జిల్లాలోని కాంగ్రెస్ నేతలంతా పదవుల కోసం ముఖ్యనేతల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆ తర్వాత ఇప్పట్లో పదవులు ఇచ్చేది లేదంటూ, స్థానిక, మున్సిపల్, పంచాయతీ ఎన్నికల తర్వాతనే నియామకాలు ఉంటాయని తేల్చడంతో చల్లబడ్డారు. తాజాగా మూడు రోజుల క్రితమే గజ్వేల్ నియోజకవర్గంలోని మార్కెట్ కమిటీలను ప్రకటించడంతో మళ్లీ ఆశావహులంతా తెరమీదకు వచ్చారు. ఇప్పుడైనా తమను పరిగణనలోకి తీసుకోవాలని సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాల కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు.

అంగన్‌వాడీలకు ఒకేసారి సెలవులు ఇవ్వాలి

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ మినీ అంగన్‌వాడీ టీచర్లకు అందరికీ మే నెల మొత్తం ఒకేసారి సెలవులు ఇవ్వాలని అంగన్‌వాడీ యూనియన్, సీఐటీయు నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ యూనియన్‌కు సంబంధించిన టీచర్స్ అండ్ హెల్పర్స్ గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండాకాలంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ మినీ టీచర్స్‌కు మే నెల అంతా ఒకేసారి సెలవులు ప్రకటిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు నిర్ణయాన్ని వెల్లడించలేదని అన్నారు. 40 డిగ్రీలకుపైగా ఎండల తీవ్రత, అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల్లేకపోవడం, పెద్ద పిల్లలు సెలవులతో ఇంట్లో ఉన్నప్పుడు, చిన్న పిల్లలు అంగన్వాడీ కేంద్రాలకు ఎంత బలవంతం చేసినా రాని భౌతిక పరిస్థితులు దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఒకేసారి సెలవులు ఇచ్చే నిర్ణయాన్ని పరిశీలించాలని కోరారు. మే నెలంతా ఒకేసారి అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ మినీ టీచర్లకు సెలవుల అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి స్నానంతో చర్మ రోగాలు మాయం



మట్టిస్నానం చేస్తున్న దృశ్యం

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మట్టి స్నానంతో చర్మ రోగాలు మాయం అవుతాయని యోగా ఆచార్యులు సిద్ది రాములు అన్నారు. శబరి గిరీషా సేవా సమితి, సంక్షేమ సిద్ది యోగా సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అయప్ప దేవాలయం సమీపంలో యోగా గురువులు పెద్ది మనోహర్, శివ శ్రీనివాస్, ఎలిగేటి కృష్ణమూర్తి నేతృత్వంలో మట్టి స్నానం కార్యక్రమం నిర్వహించారు. మొదట సూక్ష్మ యోగా ఆసనాల సాధన చేయిస్తూ ఉపయోగాలను వివరించారు. మట్టి స్నానం వల్ల కలిగే ఉపయోగాలను బోధించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారితో మట్టి స్నానం చేయించారు. ఈ సందర్భంగా సంక్షేమ సిద్ది యోగా వ్యవస్థాపకుడు ఆచార్యులు సిద్ది రాములు మాట్లాడుతూ. పురాతన కాలంలో మట్టి స్నానం ఆచరించే వారు అన్నారు. ఆధునిక కాలంలో అనేక చర్మ సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నా వారు మట్టి స్నానం ఆచరించడంతో ఉపసమనం లభిస్తుందన్నారు. ఈ స్నానంతో శరీర ఉష్ణోగ్రత తగ్గడం, మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ యోగ సభ్యులు దండే ప్రభుదాస్, శివ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జాలపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే



జాలపల్లి గ్రామంలో సర్వే చేస్తున్న పర్యవేక్షణ అధికారి ప్రవళిక

ధూళిమిట్ట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారుల వివరాలను ఇందిరమ్మ ఇండ్ల పర్యవేక్షణ అధికారి ప్రవళిక గురువారం స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి సర్వే చేశారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన వారికి ఇల్లు కట్టుకోవడానికి సొంత స్థలం ఉందా లేదా, అనర్హులకు ఎవరికైనా ఇండ్లు మంజూరు అయ్యాయా అనే విషయాలను సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు, జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కమలాకర్ యాదవ్, గ్రామశాఖ అధ్యక్షుడు సాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట, దుబ్బాక డిపోల అన్ని రకాల ఉద్యోగుల వృత్తి నైపుణ్యాన్ని, కృషిని గుర్తించి గౌరవించాలనే ఉద్దేశంతో ఇచ్చే ప్రగతి చక్రం అవార్డుల కార్యక్రమాన్ని గురువారం సిద్దిపేట ఆర్టీసీ డిపో పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ రఘు ఉద్యోగులకు అవార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరూ బాగా పనిచేసి ప్రయాణికుల మన్ననలతో పాటుగా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి సిద్దిపేట, దుబ్బాక ఆర్టీసీ డిపోలను రాష్ట్రస్థాయిలో ముందు వరుసలో నిలబెట్టాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎస్.మహేశ్వరి, అసిస్టెంట్ ఇంజనీరు రంజిత్ కుమార్,దుబ్బాక సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కనక లక్ష్మి,సూపర్వైజర్లు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న కోలా సద్గుణ రవీందర్

కుకునూరుపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి గ్రామానికి చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బీఆర్ఎస్ నాయకులు కోల సద్గుణ రవీందర్ అందజేశారు. గ్రామానికి చెందిన మొక్కని పోచవ్వ, గంగాధరి జగన్ అనారోగ్యానికి గురై ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స చేసుకొని కోల సద్గుణ రవీందర్‌ను సంప్రదించగా మొక్కని పోచవ్వ రూ. 55వేలు, జగన్‌కి రూ. 6500 విలువచేసే చెక్కులను బాధితులకు అందజేశారు.